


నేడు నృసింహస్వామి కల్యాణం

తాడేపల్లిరూరల్: పోలకంపాడులోని వరాహ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. బండ్లమ్మ వారిని మహా గౌరీ దేవిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

24న డీఈఈ సెట్ ఆన్‌లైన్ పరీక్ష

నెహ్రూనగర్: డీఈఈ సెట్ 2024 కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్ ఈనెల 24వ తేదీ నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పరిధిలో రెండు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, శ్రీ మేధా టవర్స్, చల్లావారిపాలెం, నల్లపాడు, గుంటూరు సెంటర్ కోడ్ 8384, బాలాజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బి బ్లాక్, చల్లావారిపాలెం, నల్లపాడు, గుంటూరు, సెంటర్ కోడ్ 30318 సెంటర్స్‌లో ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు 384 మంది హాజరు కానున్నారని చెప్పారు. కేటాయించిన సెంటర్‌కు అభ్యర్థులు ఒక గంట ముందుగానే హాజరు కావాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద డిపార్ట్‌మెంట్ అధికారులను కేటాయించామని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టికెట్‌లో ఏమైనా పొరపాట్లు ఉంటే డిపార్ట్‌మెంట్ అధికారుల ద్వారా సరిచేసుకోవచ్చన్నారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, గుంటూరులో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల విభాగం ద్వారా తమ సమస్యలను ముందుగానే పరిష్కరించుకోవాలన్నారు.

రేపు భావన్నారాయణుని రథోత్సవం



బాపట్ల: శ్రీ మత్స్యుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత క్షీరభావన్నారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, రథోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు కె.సుబ్బారావు తెలిపారు. మంగళవారం స్థానిక దేవాలయంలో వివరాలు వెల్లడించారు. గురువారం ఉదయం శ్రీవారి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సంతర్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బాబు నాగేంద్ర, వి.శ్రీనివాసరావు, వెంకటరమణబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హర్షించిన హలం

అన్నదాతలకు ఇన్‌పుట్ సబ్సిడీ జమ

- రూ. 104.24 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- 2023 డిసెంబరులో మిచాంగ్ తుపాను బీభత్సం
- 63,305 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- 92,218 మంది రైతులకు నష్టం
- ఆదుకున్న మిచాంగ్ సాయం



తుపాను కారణంగా నీట మునిగిన వరి పనలు (ఫైల్)



నేలవాలిన వరి పైరు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఐదేళ్ల పాలనలో అన్నదాతలను అన్ని విధాల ఆదుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల వేళ కూడా ఇన్‌పుట్ సబ్సిడీ అందించి మరోమారు రైతుల పట్ల తన ప్రేమను చాటుకుంది. ఎన్నికల కోడ్ అమలులో ఉందని ఎవ్వరికీ ప్రభుత్వ సాయం అందించకూడదని ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టి.. అడ్డుకునే కుట్రలు చేశాయి. ముఖ్యంగా టీడీపీ, జనసేన పార్టీలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకూడదంటూ గొడవలకు దిగాయి. బాధిత రైతులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని అడ్డకోవడం సరి కాదని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. చివరకు ఎన్నికల కమిషన్‌ను ఒప్పించి రైతులకు సకాలంలో పంట నష్ట పరిహారం అందించింది. గత శనివారమే జిల్లా వ్యాప్తంగా ఉన్న 92,218 మంది రైతులకు 104.24 కోట్లు మొత్తాన్ని వారి ఖాతాల్లో జమచేసింది. దీంతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది డిసెంబరులో వచ్చిన మిచాంగ్ తుపాను రైతాంగానికి తీవ్ర నష్టం మిగిల్చింది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు వరితోపాటు మిర్చి, శనగ, మొక్కజొన్న, పత్తి, పొగాకు పంటలు నీట మునిగాయి. దీంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రధానంగా 47,184.5 హెక్టార్లలో వరి పంట నీట మునగగా.. 69,124 మంది రైతులు నష్టపోయారు. 1,349.7 హెక్టార్లలో శనగ పంట దెబ్బతినగా 2,152 మంది రైతులు, 1826.9 హెక్టార్లలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లగా 2666 మంది రైతులు, 164.6 హెక్టార్లలో పత్తి పంట దెబ్బతినగా 259 రైతులు నష్టపోయారు. ఉద్యాన పంటల రైతులకు సైతం తీవ్ర నష్టం వాటిల్లింది. 5,292 హెక్టార్ల మిర్చి పంట దెబ్బతిని 8,668 మంది రైతులు నష్టపోయారు. అలాగే 5,936 హెక్టార్ల కూరగాయల పంటలు దెబ్బ తినగా 10, 255 మంది రైతులు, 399.884 హెక్టార్లలో అరటి పంట దెబ్బ తినడంతో 913 మంది రైతులకు నష్టం జరిగింది. దీంతో పాటు పంట నూర్పిడి తర్వాత 1332.48 హెక్టార్లలో పలు పంటలు వర్షానికి తడిసి దెబ్బతినడంతో 1251 మంది రైతులు నష్టపోయారు. మొత్తంగా మిచాంగ్ తుపాను వల్ల 63,305 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో 92,218 మంది రైతులకు నష్టం వాటిల్లింది.

నియోజకవర్గం	రైతులు	హెక్టార్లు	ఇన్‌పుట్ సబ్సిడీ (కోట్లలో)
అద్దంకి	6,535	3,813	5.39
బాపట్ల	14,646	10,142	17.15
చీరాల	25	18	2.877
పర్చూరు	18,246	14,392	19.56
రేపల్లె	28,220	17,202	29.24
వేమూరు	24, 546	17,738	30.03
	92,218	63,305	104.24

ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంది



నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. గత డిసెంబరులో వచ్చిన మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట పూర్తిగా దెబ్బతింది. అప్పట్లో సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో అధికారులు వచ్చి పంట నష్టం అంచనా వేశారు. ఇప్పుడు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.30,600 నా బ్యాంకు ఖాతాకు జమ చేసింది. సకాలంలో ఆదుకున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– దొంతిరెడ్డి విజయ భాస్కరరెడ్డి, రైతు, భవనంవారిపాలెం.

ఈసీ మార్గదర్శకాల మేరకు ఓట్ల లెక్కింపు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా



స్ట్రాంగ్ రూం పరిశీలనలో భాగంగా రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అధికారులు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను ఆయన ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆరు నియోజకవర్గాల ఈవీఎంలు ఉన్న గదులను పరిశీలించి, దస్త్రాలు తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూంల వద్ద ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు పటిష్ట భద్రత కొనసాగించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లు వచ్చేందుకు మార్గాలు ఏర్పాటు చేసి, బారికేడ్లు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అనుమతి లేకుండా ఎవరినీ కళాశాల ప్రాంగణం వైపు రానివ్వకూడదని స్పష్టం చేశారు. పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించేలా వెబ్ కాస్టింగ్ కంట్రోల్ రూం నడిపించాలని, అక్కడే మీడియా సెంటరు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి కొంత దూరంలో వాహనాల పార్కింగ్ స్థలం ఎంపిక చేయాలని ఎస్పీకి సూచించారు. మూడంచల భద్రతపై అధికారులను కలెక్టర్ రంజిత్ బాషా అప్రమత్తం చేశారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో జి.రవీందర్, అధికారులు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్

- ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతిలేదు
- సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ వేళ పటిష్ట బందోబస్తు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్లటౌన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఇప్పటికే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ రోజు జూన్ 4న జిల్లాలో ఎలాంటి ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమస్యాత్మక గ్రామాల్లో, ముఖ్యమైన ప్రదేశాల్లో, ప్రధాన కూడళ్లలో పోలీస్ బలగాలతో పికెట్‌లు ఏర్పాటు చేశామని ఎస్పీ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందన్నారు. బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని తెలిపారు. పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిలు వాహనాల్లో మాత్రమే నింపాలని, విడిగా బాటిల్స్‌లో పోయరాదని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలు బాణసంచా కాల్చడానికి అనుమతి లేదని, ఎన్నికల కోడ్ ముగిసే వరకు బాణ సంచా విక్రయించకూడదన్నారు. ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులను, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయటం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులు ప్రచారం చేయడం నేరమని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా పోలీసు అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలను కోరారు.

క్లుప్తంగా

రౌడీ షీటర్ హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

రేపల్లె రూరల్: రౌడీ షీటర్ హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేపల్లె మండలం గుడ్డికాయ లంక గ్రామానికి చెందిన రౌడీ షీటర్ యరగల్ల సుబ్బారావును ఇటీవల జగనన్న కాలనీ సమీపంలో ఆ కాలనీకి చెందిన విశ్వనాథపల్లి రామ్‌ప్రసాద్ అలియాస్ మొండేలు ప్రసాద్, బేతపూడికి చెందిన బడుగు ఆదర్శ్ కత్తులతో అతి కిరాతకంగా చంపారు. తల నుంచి మొండెం వేరు చేసి 200మీటర్ల దూరంలో పడవేశారు. పాతకక్షలు, విశ్వనాథపల్లి ప్రసాద్ భార్యతో మృతుడు యరగల్ల సుబ్బారావుకు ఉన్న అక్రమ సంబంధం నేపథ్యంలో హత్య చేసినట్లు తమ విచారణలో తేలిందని డీఎస్పీ పేర్కొన్నారు. మృతుడు సుబ్బారావు, హత్యకేసులో ప్రధాన నిందితుడు విశ్వనాథపల్లి రామ్ ప్రసాద్‌పై రేపల్లె పోలీసుస్టేషన్‌లో ఇప్పటికే రౌడీ షీట్‌లు ఉన్నాయని తెలిపారు. హత్య చేసిన రామ్‌ప్రసాద్, ఆదర్శ్‌ను అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కేసును త్వరితగతిన చేధించిన పట్టణ సీఐ నజీర్ బేగ్, సిబ్బందిని జిల్లా వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు.

రూ.3లక్షల విలువైన విత్తనాలు సీజ్



ఇంకొల్లు (చినగంజాం): మండల కేంద్రం ఇంకొల్లులోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మండల వ్యవసాయాధికారి కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హనుమాన్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో రెండు కంపెనీలకు చెందిన విత్తనాలకు ఎటువంటి సర్టిఫికెట్లు లేనట్లు గుర్తించారు. రూ.3,36,388 విలువ కలిగిన 28 కిలోల విత్తనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారి కె.రమణకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, మండల వ్యవసాయాధికారి పి.వేణుగోపాల్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాదినపాడులో కార్డన్ సెర్చ్

దాచేపల్లి: మండలంలోని మాదినపాడు గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఎ.సురేంద్రబాబు ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం అనుమానాస్పద నివాస గృహాల్లో తనిఖీలు చేపట్టారు. కొంతమంది ఇళ్ల నుంచి కర్రలు, రాళ్లు స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి గ్రామంలో భయనక పరిస్థితులు కల్పిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు దాసరి శివనాగరాజు, జీ.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

అశేష భక్తుల మధ్య శిడిమానోత్సవం



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ



శిడి పెళ్లికొడుకు వేషంలో గ్రామోత్సవం



గుడి చుట్టూ శిడిమాను ప్రదక్షిణలు

చీరాల టౌన్: మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీలో కొలువుదీరిన పోలేరమ్మ ఆలయ 24వ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ నెల 17 నుంచి నిర్వహిస్తున్న తిరునాళ్లలో ఆఖరి రోజు శిడి మానోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు బక్కా శివ ప్రసాద్‌రెడ్డి, పాలకవర్గం ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. మహాలక్ష్మి అమ్మవారికి పూజలు, అమ్మవారి సేవ, ప్రభోత్సవాలు భక్తిశ్రద్ధలతో చేశారు. శిడి పెళ్లి కొడుకు వేషధారణలో గ్రామంలో ఉత్సవం చేసి, శిడిమానులో మేకను పెట్టి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేశారు. పోలేరమ్మను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, సిద్దారెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాంబాబురెడ్డి పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టంతో మేలు

- ఏపీ భూ హక్కు చట్టంపై అవగాహన సదస్సు
- అభిప్రాయాలు వ్యక్తం చేసిన పలువురు వక్తలు

చీరాల రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న భూ యాజమాన్య హక్కు చట్టం అమలైతే ప్రజలకు మేలు జరుగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీనియర్స్ సిటిజన్స్ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అధ్యక్షతన ఏపీ భూ హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అధిక సంఖ్యలో ఈ చట్టానికి సానుకూలత వ్యక్తమవ్వగా.. ఒకరిద్దరు రాజకీయ నాయకులు వ్యతిరేకత వ్యక్తం చేశారు. ప్రస్తుతం భూములకు సంబంధించిన వ్యవహారం ఎంతో గజిబిజిగా ఉందని, ఒకే భూమిని అనేక మంది తమదంటే తమదని పోటీలు పడుతున్నారని చెప్పారు. మరికొందరైతే ఆ భూములకు హక్కుదారులమంటూ రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకుంటున్నారని, తద్వారా కొనుగోలు చేసిన వ్యక్తులు చివరకు మోసపోతున్నారని చెప్పారు.

నిజమైన లబ్ధిదారుడి గుర్తింపే ల్యాండ్ టైటిలింగ్..



సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత తహసీల్దారు కోటేశ్వరరావు

ప్రస్తుతం భూములు అనేక రకాలుగా వర్గీకరించబడ్డాయని, ఆయా భూములన్నింటిని ఏకం చేసి నిజమైన లబ్ధిదారుడికి భూమిని అందించేందుకు ఏర్పాటు చేసేదే ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అని వక్తలు పేర్కొన్నారు. వందేళ్ల క్రితం బ్రిటీష్ హయాంలో భూములకు సంబంధించిన నియమాలు ఇప్పటికీ అలాగే నడుస్తున్నాయని, వాటి వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. భూముల విషయంలో కోర్టుల్లో జరుగుతున్న కేసులు లక్షల్లో పెండింగులో ఉన్నాయని తెలిపారు. వాటిని పరిష్కరించుకోలేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసిన సమయంలో రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒరిజినల్ దస్తావేజులు రిజిస్ట్రార్ ఇవ్వడం లేదనే మాట అవాస్తవమని.. ఒరిజినల్ దస్తావేజులు భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న సంబంధిత యజమానికి రిజిస్ట్రార్ అందజేస్తున్నారని స్పష్టం చేశారు. కొందరు ఈ విషయాలను తప్పుగా ప్రజలకు ప్రచారం చేస్తున్నారని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ కొత్త చట్టాన్ని అమలుచేసే ముందు ప్రజాభిప్రాయ సేకరణ చేసి కచ్చితంగా అమలు చేస్తే ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయని కొందరు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ మాచర్ల మోహనరావు, విశ్రాంత తహసీల్దారు కోటేశ్వరరావు, ఊటుకూరి వెంకటేశ్వర్లు, రిటైర్డు ఏసీపీ కట్టా రాజ్ వినయ్ కుమార్, మేడ వెంకటరావు, గాదె హరిహరరావు, వసంతరావు, గజవల్లి శ్రీనివాసరావు, గూడూరి శివరామ్ ప్రసాద్, ఎల్లమందారెడ్డి, సూర్యప్రకాశరావు, జయరామిరెడ్డి, రామేశ్వర కుమార్, మణిబాబు, రామ్‌మనోహర్ లోహియ, న్యాయవాది అంబటి పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు విధిగా చిటుకు వ్యాధి నివారణ టీకా

జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ఎం.హనుమంతరావు

చీరాల టౌన్: పశు పోషకులు విధిగా జీవాలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు సూచించారు. మంగళవారం మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో పశు వైద్యురాలు డాక్టర్ పావని ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన హనుమంతరావు మాట్లాడుతూ తొలకరి వర్షాలకు గ్రామాల్లోని గొర్రెలు, మేకలు లేత పచ్చని గడ్డి తినడంతో క్లాస్టీడియా బ్యాక్టీరియా కడుపులోకి చేరి అనారోగ్యానికి గురై మృత్యువాత పడే అవకాశం ఉందన్నారు. చిటుకు వ్యాధి రాకుండా గొర్రెలకు, మేకలకు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని చెప్పారు. రైతులు, పశు పోషకులు తమ జీవాలకు టీకాలు వేయించాలన్నారు. అనంతరం ఈపురుపాలెం పశు వైద్యశాలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. పశు వైద్యురాలు పావనికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చీరాల ఏడీ డాక్టర్ చిట్టిబాబు, పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



గొర్రెకు టీకా వేస్తున్న పశు వైద్యురాలు

ఎమ్మెల్యే ఇంటిపై దాడి కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట టౌన్: ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై దాడి కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ భాస్కర్ మంగళవారం తెలిపారు. పోలింగ్ రోజు టీడీపీ ఇన్‌చార్జి చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో సుమారు 200 మంది మారణాయుధాలతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఇంటిపై దాడికి పాల్పడ్డారు. అడ్డుపడిన ఎమ్మెల్యే మామ రామకోటిరెడ్డిపై టీడీపీ గూండాలు హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. నిందితుల్లో లాం కోటేశ్వరరావు, శాఖమూరి మారుతి, బండా నాగూర్, మహబూబ్ బాషా, ఖాజా, ఇంటూరి మహేష్, తిరుపతి తొమ్మిది మంది అరెస్ట్ చేశారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే రౌడీషీట్

- సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్
- ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్

చీరాల అర్బన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో అలాగే ముందు రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నామని ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్ తెలిపారు. అలజడులు సృష్టిస్తే.. రౌడీ షీట్ తెరుస్తామని ఆయన హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. చీరాల నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో పలు ప్రాంతాల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయన్నారు. ఈ ఘటనల్లో కొంత మందిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. జూన్ 4న కౌంటింగ్ రోజు పట్టణం, రూరల్ గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గెలిచినా, ఓడినా అందరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. సమావేశంలో ఒన్‌టౌన్, టూటౌన్ సీఐలు పి.శేషగిరిరావు, సోమశేఖర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ విఠలేశ్వర్

టీడీపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

- అదనపు ప్రధాన ఎన్నికల అధికారికి వినతి
- వికలాంగుల హక్కుల సమితి అధ్యక్షుడు కాలేషా

చీరాల టౌన్: దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన తెలుగుదేశం పార్టీ చీరాల అభ్యర్థి ఎంఎం కొండయ్యపై చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి పి.కోటేశ్వరరావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కాలేషా మాట్లాడుతూ కొండయ్య దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడి, ఎన్నికల సంఘం నిబంధనలను విస్మరించారన్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం దుర్భాషలాడిన వీడియో ఫుటేజీలు అందించి, ఈసీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దివ్యాంగులను అవహేళన చేస్తూ మాట్లాడిన వీడియో ఫుటేజీ కూడా అందించామని తెలిపారు. జాతీయ దివ్యాంగుల చట్టం 2016 సెక్షన్ 92ఏ ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కొండయ్య మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను అందించి చీరాల ఆర్వో, డీఎస్పీకి ఫిర్యాదులు చేసినా.. ఎఫ్ఐఆర్ కాపీలు అందించినా చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దూపాటి రమణయ్య, బత్తుల సాయికుమార్, రాజేంద్ర ఉన్నారు.



కొండయ్యపై ఫిర్యాదు చేస్తున్న షేక్ కాలేషా

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

- పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్
- ఎన్నికల ఘర్షణలో 950 మందిపై కేసులు

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న అల్లర్లకు సంబంధించి 950 మందిపై 149 కేసులు నమోదు చేసినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ తెలిపారు. మంగళవారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని చెప్పారు. పోలింగ్‌కు ముందు, ఆ తరువాత చోటుచేసుకున్న ఘటనలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి ఆధారాలతోనే కేసులు నమోదు చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే 250 మందిని గుర్తించామని, వారిపై బైండోవర్ కేసులు పెట్టి మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి పూచీకత్తుపై విడుదల చేశామని చెప్పారు. వారిలో మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెట్రోలు బంకుల్లో విడిగా పెట్రోలు, డీజిల్ ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక బందోబస్తు కల్పిస్తామని ముఖ్యంగా అభ్యర్థులకు రక్షణ కల్పించటంలో ప్రత్యేక చొరవ చూపిస్తున్నామని, కౌంటింగ్ అనంతరం గ్రామాలలో ప్రశాంతత నెలకొల్పేందుకు అన్నీ పార్టీల ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించి, శాంతియుత వాతావరణానికి దోహదపడాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం బిగించాలని ఆమె కోరారు. అనంతరం ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేందుకు పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, గురజాల డీఎస్పీ సిహెచ్.శ్రీనివాసరావు, జగదీష్, సీఐలు బ్రహ్మయ్య, సురేష్, ఎస్ఐలు అరుణ, రాజశేఖర్, పట్టాభిరామయ్య ఉన్నారు.



పట్టణంలో పోలీసు కవాతులో పాల్గొన్న ఎస్పీ మలికా గార్గ్

మాచర్లలో అల్లర్లపై ఎస్పీ విచారణ

మాచర్ల: పట్టణానికి ఎస్పీ మలికా గార్గ్ మాచర్ల జరిగిన హింసాత్మక ఘటన సంబంధించి విచారించేందుకు మంగళవారం వచ్చారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పోలీసులు మాచర్లను పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ షాపులూ మూతబడ్డాయి. మధ్యాహ్నం నుంచి పట్టణంలో నిర్మానుష్యం నెలకొంది.ఆమె పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో కేసుల గురించి అనుమానితులు, నిందితులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

జగనన్న గృహాల పరిశీలన

లేఅవుట్లను సందర్శించిన ఢిల్లీ సెక్రటేరియట్ బృందం

ప్రత్తిపాడు: ఇళ్లు ఎలా ఉన్నాయి, నిర్మాణానికి ఎంత ఖర్చయింది, ప్రభుత్వం ఎంత చెల్లించింది, మీకు అదనంగా ఎంత ఖర్చయ్యింది, కాలనీలో వసతులు ఎలా ఉన్నాయంటూ ఢిల్లీ సెక్రటేరియట్ అధికారుల బృందం హౌసింగ్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్తిపాడులోని జగనన్న హౌసింగ్ లే అవుట్‌ను మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీ సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లుగా చేస్తున్న ఆరుగురు అధికారుల బృందం పర్యటించింది. సెక్రటేరియట్ ఏఎస్‌ఓలు జలేష్‌యాదవ్, అమర్‌దీప్ చౌహాన్, ధృవ్ దమిజా, కపిల్, పూజా, శృతిలు కాలనీలోని ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను బృంద సభ్యులకు లబ్ధిదారులు చూపించారు.

- అనంతరం నడింపాలెం గ్రామంలో బృందం పర్యటించింది. సంపద కేంద్రం (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్)లో గ్రామ పంచాయతీ చేస్తున్న వర్మీకంపోస్టు తయారీని పరిశీలించారు. వర్మీకంపోస్టు నాణ్యత బాగుండటంతో అధికారుల బృందం 12 ప్యాకెట్లను కొనుగోలు చేశారు.



రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న ఢిల్లీ అధికారుల బృందం

- తుమ్మలపాలెంలో పర్యటించిన బృందం గ్రామంలో అమలవుతున్న జలజీవన్ మిషన్ పథకాన్ని పరిశీలించింది. బృందం వెంట నోడల్ ఆఫీసర్ నాగానంద్, అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ జీవీఆర్ గుప్తా, డీపీఆర్సీ డీటీఎం నాగేశ్వరరావు, ప్రత్తిపాడు మండల ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా, పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరా తుమ్మలపాలెం శివాజీ తదితరులు ఉన్నారు.

24 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

నరసరావుపేట: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి జూన్ ఆరు వరకు నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ కోరారు. కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పదో తరగతి పరీక్షలపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా సుమారుగా 6199 మంది ప్రైవేటు, రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా పరీక్ష కేంద్రాలకు వెళ్లే విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని సంబంధిత ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఊరేగింపులు, బహిరంగసభలు వల్ల విద్యార్థులకు ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసరాలు వద్ద 144 సెక్షన్ అమలు అయ్యేలా చూడాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి సమస్యల పరిష్కారానికి 99631 92487 నంబరుకు కాల్‌చేసి పరిష్కారం పొందాలని ఆయన సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో పరీక్షలపై అధికారులతో సమీక్ష చేస్తున్న జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. పరీక్షలు ప్రతిరోజు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈమేరకు రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు 6,199 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. వీరిలో రెగ్యులర్ 3,730 మంది, ప్రైవేటు 2,469 మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

జిల్లాలో ఎక్కడా ఇసుక తవ్వకాలు లేవు

నరసరావుపేట: జిల్లాలో నాలుగు రోజుల నుంచి ఎక్కడా ఇసుక రీచ్‌లలో తవ్వకాలు జరగట్లేదని జేసీ ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్రతో కలిసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇసుక తవ్వకాలు, రవాణా జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్, కలెక్టర్ క్రోసూరులోని ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారని, అక్కడ ఎటువంటి తవ్వకాలు జరగట్లేదని గుర్తించారన్నారు. ఇక మీదట కూడా అక్రమ తవ్వకాలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. రీచ్‌లలో ట్రెంచ్‌లు తవ్వకం, చుట్టు పక్కల గ్రామాల్లో దండోరా వేయటం, ట్రోల్ ఫ్రీ నంబరు 1800–599–4599ల ద్వారా ఫిర్యాదులను స్వీకరించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సభ్యులైన ఎస్ఈబీ, పోలీసు, రెవెన్యూ, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులతో సమావేశమైన జేసీ శ్యాంప్రసాదు, అడ్మిన్ ఎస్పీ రాఘవేంద్ర